## అన్ని విభాగాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి



అనేక ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలల్లో సీసీ కెమెరాల నిఘా తక్కువగా కనిపిస్తూ ఉంటుంది. వైద్యశాలలకు నిత్యం అనేక మంది వస్తూ ఉంటారు. వారిలో మద్యం సేవించిన వారు కూడా ఉంటారు. వైద్యశాలలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటే వారిలో కూడా భయం ఏర్పాడుతుంది. దీని వల్ల మహిళా ఉద్యోగులకు కొంత భరోసా లభిస్తోంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– డాక్టర్ పావని, మెడికల్ ఆఫీసర్, దైక్ సెంటర్, తెనాలి

## నిఘాతో వెకిలి చేష్టలకు చెక్ పెట్టాలి



మెడిసిన్ చదివే సమయంలో విద్యార్థినులపై కొందరు అధ్యాపకులు వెకిలి చేష్టాలకు పాల్పడుతూ ఉంటారు. వారి పరిధిలో ప్రాక్టికల్ మార్క్స్ ఉండటం వల్ల దానిని అలుసుగా తీసుకుని వారు అలా ప్రవర్తిస్తూ ఉంటారు. చేసేది లేక అన్ని భరించాల్సిన పరిస్థితులు నెలకొంటాయి. ప్రభుత్వాలు అన్ని మెడికల్ కళాశాలలపై నిఘా ఏర్పాటు చేసి, వేధింపులకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ సుజిత, దైక్ సెంటర్ వైద్యురాలు, తెనాలి

## క్లుప్తంగా

### యంగ్ జనరేషన్ సాదిక్‌కు సత్కారం




తెనాలి: అనాథ శవాలకు అంతిమ సంస్కారాలతో సహా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ యంగ్ జనరేషన్ నిర్వాహకుడు షేక్ సాదిక్‌కు అరుదైన గౌరవం లభించింది. తెలంగాణ రాష్ట్రం క్రీడా దినోత్సవ వేడుకల సందర్భంగా శనివారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన వేడుకల్లో క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఆధ్వర్యంలో సాదిక్‌ను సత్కరించారు. పూర్వ లోక్‌సభ సభ్యుడు/ తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహదారు ఏపీ జితేంద్రరెడ్డి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివ సేనరెడ్డి చేతులమీదుగా ఈ గౌరవాన్ని అందుకున్నట్లు తెలియజేశారు.

### విజేతలకు బహుమతుల ప్రదానం



తెనాలి: పట్టణంలోని నాజరు పేట ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా భగవద్గీత శ్లోకాలు, అర్థాలపై నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు తొలిరోజు ఆదివారం సాయంత్రం బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక కొత్త పేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఏర్పాటైన సభకు ఇస్కాన్ మందిరం నిర్వాహకుడు సింహ గౌరదాస్ అధ్యక్షత వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని తెనాలి, పరిసరాల్లోని మూడు వేల మంది విద్యార్థులకు భగవద్గీత గురించి అవగాహన కల్పించి, వారికి భగవద్గీతను అందజేసినట్టు తెలిపారు. పట్టణ ప్రముఖులు కొత్త సుబ్రహ్మణ్యం, కొల్లా ధర్మకుమార్, శ్రీదేవి స్వీట్స్ వైష్ణవి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. సింహ గౌరదాస్, జనార్దనదాస్ పర్యవేక్షించారు.

### సర్వజ్ఞ సింధుకు విద్యా అవార్డులు



తెనాలి: పట్టణానికి చెందిన దీవి సర్వజ్ఞ సింధు విజ్ఞాన్ యూనివర్శిటీలో బీటెక్ (బయోటెక్నాలజీ)లో 'బెస్ట్ ఔట్ గోయింగ్ స్టూడెంట్-2024, చైర్మన్స్ గోల్డ్ మెడల్ అవార్డును స్వీకరించారు. విజ్ఞాన్ యూనివర్శిటీలో శనివారం జరిగిన 12వ స్నాతకోత్సవంలో ఈ అవార్డులను అందుకున్నారు. బయోటెక్నాలజీలో 9.66 గ్రేడ్ సాధించారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో వివిధ కంపెనీల నుంచి మంచి ప్యాకేజీతో ఉద్యోగ ఆఫర్లను అందుకున్నారు. పట్టణ చినరావూరుకు చెందిన దీవి వేణుగోపాల్, అనంతలక్ష్మి (గోవాడ) దంపతుల కుమార్తె సర్వజ్ఞ సింధు.

### బాలికల వసతి గృహానికి చేతిపంపు వితరణ



తెనాలి: విశ్రాంత అధ్యాపకుడు డీజీ సుందరరావు 25వ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు స్థానిక సీబీఎన్ కాలనీలోని గిరిజన గురుకుల బాలికల హాస్టల్‌లో చేతి పంపు సౌకర్యం కల్పించారు. మోటారును సమకూర్చారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థినులకు నాన్ వెజ్ భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో సుందరరావు భార్య వెంకటమ్మ, కుమార్తె డాక్టర్ డి.జీవనలత పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కేవీపీ స్కూల్ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏఎన్‌యూలో ఈ నెల 22న జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబర్చిన డాక్టర్ కేవీపీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాలరోడ్డులోని కేవీపీ స్కూల్లో అండర్-14, 15, 16, 18 జిల్లా స్థాయిలో ఓపెన్ స్పోర్ట్స్ మీట్‌కు జిల్లా వ్యాప్తంగా 44 పాఠశాలల నుంచి 1,500 మంది క్రీడాకారులు పోటీపడ్డారని చెప్పారు. క్రీడా పోటీల్లో భాగంగా లాంగ్ జంప్, హై జంప్, జావలిన్ త్రో, 60 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకంతో పాటు షాట్‌పుట్, లాంగ్ జంప్ విభాగాల్లో రజతం, 600 మీటర్ల పరుగులో కాంస్యం కైవసం చేసుకున్నట్లు వివరించారు.

# కూరగాయల సాగుకు సమయమిదే

- నానాటికి ధరల పెరుగుదల
- సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు
- ప్రభుత్వం రాయితీపై విత్తనాల సరఫరా
- నియోజకవర్గంలో 480 ఎకరాల్లో కూరగాయల సాగు

కొల్లిపర: ఆదాయంతోపాటు ఆరోగ్యాన్నిచ్చే మేలైన కూరగాయల సాగుకు సరైన సమయం ఇదేనని ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులకు రైతులకు సూచిస్తున్నారు. కూరగాయలు సాగు చేసే రైతులు అధికారుల సూచనలకు అనుగుణంగా నూతన యాజమాన్య పద్ధతులు, మెళకువలు పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందవచ్చు. ప్రధానంగా విత్తనాల కొనుగోలు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రతి నెలా ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు. జులై నుంచి సెప్టెంబర్‌లో పందిరి కూరగాయలైన బీర, కాకర, సొర, పొట్ల, అనపతో పాటు బూడిద గుమ్మడి, వంగ, బెండ, టమాటా తదితర రకాలను సాగు చేయటానికి అనుకూలంగా ఉంటుంది. తెనాలిలో వెయ్యి ఎకరాలు, కొల్లిపర మండలంలో 2,500 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగుచేస్తున్నారు. ఇందులో తెనాలిలో 180 ఎకరాల్లో, కొల్లిపర మండలంలో సుమారు 250 ఎకరాల్లో కూరగాయలు సాగవుతున్నాయి. అధికంగా కూరగాయలు సాగు చేపట్టాలనే ఉద్దేశంతో మేలైన విత్తనాలను 50 శాతం రాయితీపై ప్రభుత్వం అందజేస్తోంది. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన రశీదు, పాస్ బుక్, బ్యాంక్ ఖాతా, రైతు ఆధార్ వంటి పత్రాలు, దరఖాస్తు ఫారాన్ని గ్రామ ఉద్యానశాఖ అసిస్టెంట్ల ద్వారా జిల్లా కార్యాలయానికి పంపించాలి. డీహెచ్‌వో పరిశీలించి విత్తన రాయితీ సొమ్ము నేరుగా రైతుల ఖాతాకి జమ చేస్తారు. తీగ జాతి కూరగాయలైన బీర, కాకర, పొట్ల దొండ పంటలను పందిరి విధానంతో (కట్టెలు, సన్న తీగ, దారాలతో) సాగు చేసే రైతులకు ఎకరానికి 40 శాతం సబ్సిడీతో రూ.8,000, మల్చింగ్ పద్ధతి( ప్లాస్టిక్ కవర్లు భూమిపై పరిచి సాగు) ద్వారా సాగు చేసే రైతులకు ఎకరానికి 50 శాతం సబ్సిడీతో రూ.6,500లు ఉద్యాన శాఖ రాయితీ అందిస్తోంది.



తూములూరుతో తీగ చిక్కుడును పరిశీలిస్తున్న ఉద్యాన విస్తరణ అధికారి పి.శ్రీధర్‌రెడ్డి



అన్నవరం గౌడ పాలెంలో పొట్లకాయ పంట

**విత్తుకు ముందుకు జాగ్రత్తలు..**

కూరగాయల సాగుకు ముఖ్యంగా విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని అధికారులు సూచిస్తున్నారు. కిలో విత్తనానికి నాలుగు గ్రాముల థైరమ్, 5 నుంచి 6 గ్రాముల ఇమిడాక్లోఫిన్ మందును ఒక దాని తరువాత మరొకటి కలిపి విత్తన శుద్ధి చేయటం వల్ల మొక్కలకు తెగుళ్లను తట్టుకునే శక్తి వస్తుంది. విత్తే ముందు ఎకరానికి 8 టన్నుల పశువుల ఎరువు, 40 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ మిశ్రమాన్ని గింజలు నాటిన చోట ఉన్న బెజ్జంలో వేయాలి. విత్తిన 30 రోజుల్లో లేదా పిందె దశలో సుమారు 31 కిలోల నత్రజనిని మొక్కలకు అందించాలి. సాగు సమయంలో కలుపు లేకుండా ఎప్పటికప్పుడు అధికారుల సూచనలు మేరకు జాగ్రత్తలు తీసుకోవాలి. కూరగాయల సాగు చేసే రైతులు వేసవిలోనే రెండు సార్లు దుక్కి దున్ని ఉంచుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

### జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు



రైతులు ఉద్యాన, వ్యవసాయాధికారుల సూచనలు ప్రకారం యాజమాన్య పద్ధతులు పాటిస్తే కూరగాయల సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతులకు ఉద్యాన శాఖ ద్వారా 50 శాతం రాయితీపై విత్తనాలు అందించడం జరుగుతోంది. కూరగాయల సాగుకు ప్రస్తుతం సరైన సమయం కావడంతో తీగజాతి పంటల సాగుకు రైతులు ముందుకు రావాలి.

– పి.శ్రీధర్‌రెడ్డి, ఉద్యాన విస్తరణ అధికారి, తెనాలి

## సెలవు దినాల్లో తరగతులు సహించం



తెనాలి: ప్రభుత్వ సెలవు దినాల్లో తరగతులు నిర్వహించే విద్యా సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ కోరారు. తెనాలి నియోజకవర్గ నాయకులతో కలిసి ఆదివారం పట్టణంలో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు/ కార్పొరేట్ కళాశాలలకు వెళ్లి మూసివేయించారు. ర్యాంకుల పేరుతో ఎక్కువ సమయం క్లాసులు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం కచ్చితమైన నిర్ణయం తీసుకుని ఈ చర్యలను అరికట్టాలని వెంకటేష్ డిమాండ్ చేశారు. పలుసార్లు ఎంఈవో, డీఈవోకు చెప్పినప్పటికీ ఫలితం ఉండటం లేదన్నారు. అధికారులు యాజమాన్యాలు వినడం లేదన్నారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకుడు మద్దినేని కిరణ్‌బాబు మాట్లాడుతూ.. సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే, తమ సంస్థ ఆధ్వర్యంలో కచ్చితంగా అడ్డుకుని తీరతామని స్పష్టం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకరించి ముందుకు రావాలని కోరారు. పట్టణ కార్యదర్శి చెన్నూరి సాయి, ఉపాధ్యక్షుడు భూమేష్, వివేక్, పండు, ఎర్మియా, సాయి, తేజ పాల్గొన్నారు.

# గత ప్రభుత్వంపై విమర్శలు అసమంజసం

**కూటమి నాయకులకు వైఎస్సార్ సీపీ నేతల హితవు**

తెనాలి: కూటమి ప్రభుత్వం ఈ నెల 23న నిర్వహించిన గ్రామ సభలు రాజకీయ పార్టీ కార్యక్రమాలుగా జరిగాయని, వాటిలో చిత్తశుద్ధి లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. పైగా గత ప్రభుత్వంలో గ్రామ సభలు ఏమీ జరగనట్లుగా నేతలు చేస్తున్న వ్యాఖ్యలకు ప్రజలు నవ్వుకుంటున్నారని దుయ్యబట్టారు. స్థానిక గంగానమ్మ పేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, కొల్లిపర మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు మాట్లాడారు. గత ప్రభుత్వంలో గ్రామ సభలను చిత్తశుద్ధితో నిర్వహించి, ప్రాధాన్యం ప్రకారం అభివృద్ధి పనులు చేశామని గుర్తుచేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతి సచివాలయం ఎదుట బోర్డులు కూడా ఉంచినట్లు తెలిపారు. ధర్మరాజుల చెన్నకేశవులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నపుడు గ్రామ సభలు జరిపి, చేసిన ఉపాధి హామీ పనుల లెక్క చెబుతామని, క్షేత్రస్థాయిలో చూపించగలమన్నారు. ఉపాధి హామీ పనులకు గ్రామ సభల్లో నిర్వహించడం సాధారణంగా జరిగే వ్యవహారమేనని అవుతు పోతిరెడ్డి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు సభలు జరిపిందని, అభివృద్ధి పనులు ఎంతవరకు చేస్తారో చూడాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గ్రామసభలు జరగలేదనడం అవాస్తవమన్నారు. కూటమి నేతలు తమ గొప్పలు తాము చెప్పుకోవచ్చనీ, గతంలో ఏమీ జరగలేదని చెప్పడం సరికాదని దేసు శ్రీనివాసరావు అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో చెప్పింది చేశానని ధీమాగా చెప్పారని గుర్తుచేశారు. కూటమి నేతలు సూపర్ సిక్స్ అమలులో కాలయాపన చేస్తున్నారని, ఎప్పుడు అమలు చేసేదీ చెప్పడం లేదన్నారు. గత ప్రభుత్వంపై విమర్శలు మాని, హామీలు అమలు చేయాలని హితవు పలికారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, మొగల్ అహ్మద్, పార్టీ నేతలు కావేటి నిర్మల, మన్నవ శాంతిశ్రీ, పినపాటి అనిల్, బొంతు నరేంద్రరెడ్డి, ఆలీనగర్ బాషా, వీరమల్లు కార్తికేయ, కె.స్వామి, షేక్ షమీ, గుంటూరు కృష్ణ, వేముల మహేష్, యలవర్తి సాంబశివరావు, అక్కిదాసు కిరణ్‌కుమార్, షేక్ బాజీ, కాళిదాసు సత్యం, సతీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు పక్కన ఎంపీపీ చెన్నకేశవులు, పార్టీ నేతలు

## డిగ్రీ విద్యార్థి అదృశ్యం

తెనాలిరూరల్: సరిగా చదవడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో డిగ్రీ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కఠెవరం కట్టకు చెందిన 22 ఏళ్ళ కోట్ల గణేష్ ఇంటర్ చదివి దాల్ మిల్లులో డ్రైవర్‌గా పని చేశాడు. డిగ్రీ చదువుతానని తల్లిదండ్రులను అడగడంతో తెనాలిలోని డిగ్రీ కళాశాలలో చేర్చారు. సరిగా చదవకపోతుండడంతో గత నెల 27న తల్లిదండ్రులు మందలించారు. దీంతో అతను ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గతంలోనూ వెళ్లి కొద్ది రోజులకు తిరిగి వచ్చే వాడు. ఈ క్రమంలో ఎన్ని రోజులు ఎదురు చూసినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ పి. కోటేశ్వరరావు ఆదివారం తెలిపారు.

## నవులూరులో ఉచిత వైద్యశిబిరం



మంగళగిరి: నవులూరు పుట్టతోటలోని నాగేంద్రస్వామి కళ్యాణ మండపంలో ఆదివారం సుబ్రహ్మణ్యస్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గుండె, నేత్ర, దంత, మహిళలకు సంబంధించిన గర్భకోశ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్లు పి.వినయ్‌కుమార్, జి.అనూష, ఎ.శేషగిరి, ఎ.రాధిక సేవలు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కె.రామకృష్ణారెడ్డి, కె.రత్నకుమారి, ధనలక్ష్మి, షైన్ ఫౌండేషన్ చైర్మన్ డీజీ నాయక్, తిరుమలరెడ్డి, వంగపాటి శ్రీనివాసరావు, అన్నే వివేకానంద, తమ్మిన సాయి వినయ్, రామిరెడ్డి, ధర్మారావు పాల్గొన్నారు.

## తొమ్మిది మంది జూదరుల అరెస్ట్

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడి ఫ్లై ఓవర్ కింద పేకాటాడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. వీరి నుంచి రూ.15,100 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి జూదరులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# సమాజంలో తగ్గిపోతున్న మానవత్వం

తెనాలి: సైన్స్, టెక్నాలజీ రంగాల్లో ఎంతగానో పురోగమిస్తున్న నేటి కాలంలో మనుషుల్లో మానవత్వం తగ్గిపోతుండటం శోచనీయమని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ విచారం వ్యక్తం చేశారు. మానవత్వం మనిషి తనానికి ప్రతీకగా చెబుతూ, సమాజం కోల్పోతున్న మంచినీ, మానవత్వాన్ని మేల్కొలపటానికి స్వచ్ఛంద సేవా సంస్థ మానవత చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మానవత సేవా కార్యక్రమాల్లో తనను కూడా భాగస్వామ్యం చేయాలని కోరారు. మానవత, తెనాలి శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ లైబ్రరీ హాలులో నిర్వహించారు. తెనాలి శాఖ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. ప్రత్యేక ఆహ్వానితుడు, అమృతసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.రామమోహనరావు మాట్లాడుతూ తెనాలి ప్రాంతం తమకు ఎంతగానో ఇచ్చిందని, తిరిగి సేవ చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. మానవత రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సంస్థ తెనాలి శాఖ చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు ప్రశంసనీయమని చెప్పారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను సత్కరించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ కటకం వెంకట ప్రసాద్ (ఓంకార్ ప్రసాద్), ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి పి.వెంకట్, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్యశాస్త్రి, మహిళా విభాగం అధ్యక్షురాలు కె.కల్యాణి, మొవ్వా సత్యనారాయణ, వెంపటి సత్యనారాయణ, ఆలపాటి వెంకట్రామయ్య, వై.రోహిణి, ఎ.లక్ష్మి, మానవత సభ్యులు పాల్గొన్నారు.



కేవీ గోపాలకృష్ణకు సత్కారం

# వృద్ధాప్యం ఎవరికీ శాపం కారాదు

తెనాలి: వృద్ధాప్యం ఒక శాపంలా కాకుండా వరంలా ఉండాలని ఇందుకు వృద్ధులకు మనోధైర్యంతో పాటు వారి కుటుంబ సభ్యుల సహకారం కూడా ఉండాలని పావులూరి ట్రస్ట్ వ్యవస్థాపకుడు, గుడివాడ ఏఎన్నార్ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపల్ పావులూరి శ్రీనివాసరావు అన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన సభకు అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. 'వార్ధక్యంలో ఆనందం' అనే అంశంపై శ్రీనివాసరావు మాట్లాడారు. వయోభారంతో మానసిక అశాంతికి గురికారాదని సూచించారు. వయసు కారణంగా వచ్చే అనారోగ్యాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, వ్యాధులు దరిచేరితే తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. అందరితో కలిసిమెలసి ఉండాలన్నారు. తన జీవితానుభావాలతో నేటి తరానికి తగిన మార్గదర్శనం చేయాలని కూడా చెప్పారు. ఆధ్యాత్మికతను అనుసరిస్తూ మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని చెప్పారు. మొవ్వా సత్యనారాయణ చేస్తున్న సమాజ సేవను అభినందిస్తూ తనవంతు ఆర్థిక సాయంతో సేవలను అందిస్తానని చెప్పారు. కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్రరావు, వేంకట సత్యనారాయణ, అజ్గర్ అలీ, చలమయ్య, రాజేంద్రప్రసాద్ ప్రభృతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పావులూరి శ్రీనివాసరావు

# ఆత్మీయ పలకరింపులు..



విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో పూర్వ విద్యార్థులు

తెనాలి రూరల్: దేశ నలుమూలలా స్థిరపడిన స్నేహితులు. 21 ఏళ్ల దాటిన పాఠశాల స్నేహం. ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్న క్షణం. మళ్లీ చిన్న పిల్లలయ్యారా..! అన్న భావన. ఏరా.. ఎలా ఉన్నావు..! ఏంటీ ఏం చేస్తున్నావు..! అనే పలకరింపులు. పెదరావూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం దృశ్యాలివీ.. 2002-03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల 'ఆత్మీయ కలయిక' పాఠశాల ఆవరణలో జరిగింది. విశాలమైన పాఠశాల ఆవరణలో కలియ తిరుగుతూ.. ఒకరినొకరు కుశల ప్రశ్నలు వేసుకుంటూ..ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు తల్లం వెంకట సుబ్బారావు, కొడాలి రాజ్యలక్ష్మి, పమిడిముక్కల వరలక్ష్మి, షేక్ అబ్దుల్ సత్తార్, వరికూటి శ్రీనివాస్ రావును ఘనంగా సత్కరించి, గౌరవించుకున్నారు.

## సత్రం సేవలు అభినందనీయం

నగరంపాలెం: దశాబ్దాల తరబడిగా సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ అన్నారు. సాంబశివపేట ఒకటో వీధి చుండూరు వెంకటరత్నం, నాగమ్మ సత్రంలో ట్రస్టీల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు, పెన్నులు, మహిళలకు చీరలు, వృద్ధులకు దుప్పట్లు ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. చుండూరు దామోదర్‌రావు మాట్లాడుతూ తాతయ్య, నాయనమ్మల జ్ఞాపకార్థం మొదట్లో చలి వేంద్రాలు, 1965లో సత్రాన్ని నిర్మించి వందలాది మందికి ఆశ్రయం కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాన్సీ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు జుజ్జూరు శేష ప్రభాకరరావు, కార్యదర్శి రంగా రామకృష్ణ, కొనగళ్ల సత్యం, ఆలమూరు విజయలక్ష్మి, కోట శేషగిరి, ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ మల్లేశ్వరరావు, దేవదాయ శాఖ ఏసీ వి.అనుపమ, ఈఓలు ఎంవీఎస్.వర్మ, మానుకొండ విజయ పాల్గొన్నారు.

# బడుగుల జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు మండల్

మంగళగిరి: బడుగు బలహీన వర్గాల జీవితాలలో వెలుగులు నింపిన మహానుభావుడు బీపీ మండల్ అని బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ పేర్కొన్నారు. పట్టణంలోని జాతీయ రహదారి వెంట ఉన్న బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బీపీ మండల్ జయంతి ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఓబీసీ చైర్మన్‌గా 3,743 కులాలుగా జనాభాలో 52 శాతంగా ఓబీసీలు ఉన్నారని వారికి విద్య ఉద్యోగ రంగాలలో 27 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రతిపాదించి బడుగుల జీవితాలలో వెలుగులు నింపిన బీపీ మండల్ కృషి అభినందనీయమన్నారు. 1979లో రెండో జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్‌గా ఓబీసీల అభ్యున్నతికి 40 సిఫార్సులతో నివేదిక సమర్పించినట్లు తెలిపారు. రాజ్‌కిరణ్, కాగితాల స్వాతిగౌడ్, శ్రీనివాసరావు, కిరణ్, కాట్రు ధనుంజయ్, కొల్లి నాగేంద్ర, బాలాజీ, విజయభాస్కర్, దానగౌడ్ పాల్గొన్నారు.



బీపీ మండల్ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

## ప్రేక్షకులను ముగ్ధలను చేసిన శాస్త్రీయ గాత్ర సంగీత కచేరి



నగరంపాలెం: శ్రీకృష్ణాష్టమి పండుగ సందర్భంగా లక్ష్మీపురం శ్రీత్యాగరాజ కళావేదికపై ఆదివారం యువ కళాకారులతో శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. భారత్ వికాస్ పరిషత్ గుంటూరు శాఖ అధ్యక్షులు చలమయ్య ఆధ్వర్యంలో కచేరి నిర్వహించగా, కళాకారులు సంపూర్ణలక్ష్మి, ఎం.సరయుమాల్కోస్, శ్రీకర్, బి.బృంద, కె.లలిత రాజ్యలక్ష్మి, లక్షణ్య, రోహిత తమ గాత్రంతో వాగ్గేయకార కీర్తనలను అద్భుతంగా ఆలపించారు. ప్రేక్షకులను అలరించాయి. వయోలిన్‌పై పి.జయతి, మృదంగంపై సి.హెచ్.సూర్య వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్, సంస్థ కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం కళాకారులను, అతిథులను సంస్థ నిర్వాహకులు సత్కరించారు.